ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి

ప్రధాన కార్యదర్శి ... నామాల నాగార్జున

అధ్యక్షుడు వీరేష్

పేదలే లక్ష్యంగా దా'రుణం'..!



◆ గృహ రుణాల పేరుతో మోసం

◆ మంజూరు చేసిన రుణం రూ.3.17 లక్షలు

◆ ఖాతాలో జమ చేసింది రూ.2 లక్షలే..!

◆ పేదల రక్తం పీలుస్తున్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్

◆ కలెక్టర్ స్పందించాలంటూ బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-హిందూపురం

పేదలపై ప్రయివేటు కార్పొరేట్ ఫైనాన్స్ దా'రుణం' ఆగడం లేదు. కష్టంలో ఉన్న వారికి రుణాలు ఇస్తున్నట్లు నటించి నిబంధనల మాటును వారి రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారు. హిందూపురం ప్రాంతంలో వందలాది మంది ఇలా ఓ ప్రయివేటు ఫైనాన్స్‌లో డబ్బులు తీసుకుని ఏళ్ల తరబడి కంతులు చెల్లిస్తున్నా రుణ విముక్తి కాక వడ్డీ కూపంలో కూరుకుపోయారు. హిందూపురం కేంద్రంగా ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఇంటి పత్రాలను తనాఖా పెట్టుకుని రుణాలను ఇస్తుంది. ఇచ్చిన రుణాలకు వాయిదాల పద్ధతుల్లో వడ్డీతో కలిపి కంతులను తీసుకుంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా రుణం మంజూరులో లెక్కలేనన్ని నిబంధనలతో జనం నెత్తిన టోపీ పెడుతున్నారు. పేదలు తీసుకున్న రుణం మొత్తం వడ్డీలకే సరిపోతుండడంతో ఏళ్లు గడుస్తున్నా అసలు తీరే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో బాధితులు నిత్యం ఆ ఫైనాన్స్ సంస్థ వద్దకొచ్చి వారి గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థ పేదలను లక్ష్యంగా చేసుకుని వారి అవసరాలను ఆసరాగా చేసుకుని ఇంటి పత్రాలను తనఖా పెట్టుకుని రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నట్లు ఆశ పెడుతున్నారు. తీసుకున్న రుణాలకు సంబంధించి ప్రతినెలా సిబ్బంది చెప్పిన విధంగానే నెలవారి కంతులను చెల్లిస్తున్నారు. రుణం పొందిన పేదలు చెల్లిస్తున్న నెలవారి కంతులు ఫైనాన్స్ సంస్థ వడ్డీలకు వడ్డీ వేసి వారు కడుతున్న కంతులను ఇచ్చిన రుణానికి వడ్డీ రూపంలోనే జమ చేసుకుంటున్నారు. చెల్లించే కంతులను వడ్డీ కింద ఫైనాన్స్ సంస్థ జమ చేసుకుంటే, తీసుకున్న రుణాలు ఎప్పుడు తీరుతాయని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ స్పందించాలి

ప్రయివేటు సంస్థలు ఇచ్చిన రుణాలు, కంతుల చెల్లింపు విధానంపై కలెక్టర్ స్పందించి ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే ఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని, నేటికీ వడ్డీలు చెల్లిస్తున్న వివరాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు బాధితులు చెబుతున్నారు. ఈ ఫైనాన్స్ రుణ మంజూరుపై సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులూ కోరుతున్నారు.

రుణం మంజూరు కాక పోయినా వాయిదాలను ఎందుకు చెల్లించాలని వాదిస్తున్న మాబుసాబ్ కుమారుడు షెక్షావలి

21 నెలలు కంతులు కట్టినా వడ్డీకే సరి..!

చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామానికి చెందిన సరోజమ్మ తనకున్న స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుని తన సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలనుకుంది. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఈమెకు ఇళ్లు మంజూరు కాలేదు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు హిందూపురం పట్టణంలో ఉన్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌ను సంప్రదించింది. తన స్థలానికి సంబంధించిన పత్రాలను చూపించి, 2022 సంవత్సరం ఆగస్టులో రుణంకు దరఖాస్తు చేసుకుంది. సంస్థ ప్రతినిధులు అన్ని పత్రాలనూ పరిశీలించిన అనంతరం ఆమెకు రూ.3,17,844 మంజూరు చేసింది. ఇందులో ఫైనాన్స్ సంస్థ ఫీజులు పోగా మిగిలిన రూ.2,89,630 సంస్థ మంజూరు చేసింది. మంజూరు చేసిన నగదులో తొలివిడత ఆగస్టు 27వ తేదీన సరోజమ్మ ఖాతాకు రూ.1,00,681 జమ చేసింది. రెండవ విడత 2023వ సంవత్సరం జూన్ నెలలో రూ.1లక్షను ఫైనాన్స్ సంస్థ జమ చేసింది. మిగిలిన డబ్బులను ఇంతవరకు ఫైనాన్స్ సంస్థ సరోజమ్మ ఖాతాకు జమ చేయలేదు. రుణ మంజూరు సమయంలో ఇంటి నిర్మాణం పూర్తి అయిన తర్వాతే ఫైనాన్స్‌కు చెల్లించాల్సిన నెల వారి కంతులు చెల్లించాలని సిబ్బంది తెలిపారు. నెల వారి కంతులు రూపంలో నెలకు ఆమె రూ.3,812 సంస్థకు చెల్లిస్తోంది. ఇలా ఇప్పటికి 21 నెలలకు ఫైనాన్స్ సంస్థకు రూ.80 వేలు చెల్లించింది. ఈ చెల్లించిన మొత్తం వడ్డీకే సరిపోయిందని, అసలు ఇంకా రూ. 3.17 లక్షలు చెల్లించాల్సి ఉందని ఫైనాన్స్ సిబ్బంది తెలపడంతో సరోజమ్మ ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడింది. ఇదే విషయంపై ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కార్యాలయానికి వచ్చి తన ఆవేదనను కన్నీరు కార్చుకుంటూ కార్యాలయంలో ఉన్న సిబ్బంది ముందు పోయింది.

రుణం ఇవ్వకుండానే ఇచ్చినట్లు మోసం...

సోమందేపల్లి చెందిన మహబూబ్ కూతురికి వివాహం నిశ్చయం అయ్యింది. డబ్బులు తక్కువగా ఉండడంతో తన ఇంటిని తాకట్టుపెట్టి డబ్బులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో హిందూపురంలోని ఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో ఇంటిని తాకట్టు పెట్టి రుణం పొందేందుకు అక్కడి సిబ్బందిని సంప్రదించాడు. ఇంటి పత్రాలను చూసిన సిబ్బంది అగ్రిమెంట్ చేయడానికి రూ.3 వేలు చెల్లించాలని, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్టిగేజ్ చేయించాలని సూచించారు. దానికి అతను రూ.6 వేలు ఖర్చు చేసుకున్నాడు. అనంతరం పరిశీలనకు వచ్చిన ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ డబ్బునూ అతను ఇచ్చాడు. అన్నీ పూర్తయిన తర్వాత మాబుసాబ్‌కు రూ.3.18లక్షలు మంజూరు అయినట్లు, లోన్ ప్రాసెసింగ్ ఫీజు పట్టుకుని మిగిలిన రూ 2.90 లక్షలు ఖాతాకు జమ అయినట్లు సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్ అయితే వచ్చిందిగానీ ఇప్పటి వరకు డబ్బులు మాబూసాబ్ ఖాతాకు జమ కాలేదు. డబ్బులు జమ కాకపోయినప్పటికీ మొదటి నెల వాయిదా కంతును చెల్లించాలని సంస్థ నుంచి ఫోన్లు వచ్చాయి. కంగుతిన్న అతను పట్టణంలో ఉన్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కార్యాలయంకు వచ్చి తన ఆవేదనను సిబ్బంది ముందు వ్యక్తం చేశారు. కార్యాలయంలో తన రుణానికి సంబంధించి పరిశీలన చేస్తే పత్రాలు సరిగా లేకపోవడంతో రుణం మంజూరు కాలేదని సిబ్బంది చెప్పారు. రిజిస్టర్ పత్రాలు లేని కారణంగా రుణం మంజూరు కాదని వారు పేర్కొన్నారు. రుణం ఇవ్వక పోవడంతో తన ఇంటికి సంబంధించిన పత్రాలను ఇవ్వాలని సిబ్బందిని ఆయన అడిగాడు. రూ.1300 చెల్లించి, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్టిగేజ్‌ను రద్దు చేసుకుని వచ్చి దానికి సంబందించిన పత్రాలను ఇచ్చిన వారం తర్వాత ఇస్తామని అక్కడి సిబ్బంది చెప్పారు. రుణం ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డులు సృష్టించి, ఇప్పుడు రద్దు చేయాలని చెప్తే ఎందుకు చేయరని ఆయన సిబ్బందితో వాదించారు. రుణం మంజూరు కాకపోయినప్పటికీ దాదాపు రూ.15 వేలకు పైగా ఖర్చుపెట్టుకున్నానని, ఇప్పుడు మళ్లీ రద్దు చేయడానికి రూ.5వేలు ఖర్చు అవుతుందన్నారు. తన వద్ద డబ్బు లేదని సిబ్బంది ముందు కన్నీరు కార్చినప్పటికీ, ఫైనాన్స్ సిబ్బంది నిబంధనల పేరుతో అతన్ని బయటకు పంపారు.

ఎస్ఎఫ్ఐ శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఎన్నిక

◆ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వీరేష్, నాగార్జున

◆ ముగిసిన జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-పెనుకొండ

ఈనెల 24, 25వ తేదీల్లో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) శ్రీ సత్యసాయి 6వ జిల్లా మహాసభలు పెనుకొండ పట్టణంలో ఘనంగా జరిగాయి. మంగళవారంతో మహాసభలు ముగిశాయి. రెండు రోజులు పాటు జరిగిన మహాసభల్లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, మాజీ విద్యార్థి సంఘం నాయకులు ఈఎస్.వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రానున్న రోజుల్లో విద్యా రంగంలో వస్తున్న మార్పులు, విద్యార్థుల సమస్యలపై ఎలాంటి కార్యాచరణ తీసుకోవాలన్న అంశాలపై మహాసభల్లో నాయకులు చర్చించారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు విద్యార్థులు, ప్రభుత్వ విద్యారంగం సంక్షేమం కోసం హామీలను అమలు చేసేలా పోరాటాలు చేసేలా మహాసభలో తీర్మానాలు చేశారు.

ఎస్ఎఫ్ఐ శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఎన్నిక

ఈనెల 24, 25వ తేదీల్లో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) శ్రీ సత్యసాయి 6వ జిల్లా మహాసభలు పెనుకొండ పట్టణంలో ఘనంగా జరిగాయి. మంగళవారంతో మహాసభలు ముగిశాయి. మహాసభల్లో భాగంగా మంగళవారం నాడు ఎస్ఎఫ్ఐ సత్యసాయి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. 14 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నామాల నాగార్జున, అధ్యక్షుడిగా వీరేశ్, ఉపాధ్యక్షులుగా పవన్ కుమార్, భగత్, నందీష్, హర్ష కమిటీ సభ్యులుగా హరి, రాజు, సాయిరాం, అనిల్ శ్రీనాథ్, విష్ణువర్ధన్‌ను ఎనుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో విద్యా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయనున్నట్లు తెలియజేశారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక ప్రగతి

కలెక్టర్ టిఎస్.చేతన్

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారానే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టిఎస్.చేతన్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. మొదట జిల్లా పరిశ్రమల శాఖ పనితీరును సమీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా చేయూతనివ్వాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ మహిళలకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించి ఉత్పత్తి, సేవారంగ పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. నిర్దిష్ట గడువులోగా అనుమతులు మంజూరు చేయాలన్నారు. బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలని సకాలంలో లీడ్ బ్యాంకు మేనేజర్‌కు సమర్పించాలన్నారు. పెండింగ్ లో ఉన్న 69 దరఖాస్తులను వారంలోపు క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో నానో పార్కుల అభివద్ధి చేయడానికి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల జిఎం నాగరాజు, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ సహని, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, డిక్కీ జోనల్ అధ్యక్షుడు కెవి.రమణ, నాబార్డ్ ఏజీఎం అనురాధ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు .?

ప్రజాశక్తి - కొత్తచెరువు

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీలు సరళ, గంగరాజు అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ సమావేశంలో చర్చించే సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదని ఇలాంటి సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ప్రశ్నించారు. ఎంపీటీసీ రఫీ మాట్లాడుతూ పలువురు అధికారులు వారి శాఖల పరిధిలో జరిగే సమావేశాలకు గాని, అభివృద్ధి పనుల ప్రారంభానికి తమను ఆహ్వానించడం లేదని అన్నారు. ప్రోటోకాల్ ను పాటించలేదన్నారు పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయిన విషయాన్ని సభ్యులు ప్రస్తావించారు. ఎంపీడీవో నటరాజ్ మాట్లాడుతూ ఈ సమావేశానికి హాజరు కాని అధికారులపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు

లారీలు రాక రైతులు, ఏజెన్సీ నిర్వాహకులు గగ్గోలు

ప్రజాశక్తి రొద్దం

కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న కందుల బస్తాలు

రైతుల నుంచి సేకరించిన కందులను తరలించడానికి మార్క్‌ఫెడ్ కంపెనీవారు లారీలను పంపించకపోవటంతో రైతులు ,కందులు కొనుగోలు నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. గత నాలుగు రోజులుగా ఏజెన్సీ నిర్వాహకుల వద్దనే కందులు నిల్వ ఉన్నాయి. అధికారులు లారీలు పంపించకపోవడంతో దాదాపు 7వేల క్వింటాళ్ల కంది కొనుగోలు కేంద్రం వద్దని ఉంచుకొని లారీల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, ఆర్డీవో, ఎంతమంది అధికారులు ఇక్కడ వచ్చి కంది నిల్వ ఉన్న కేంద్రాన్ని పరిశీలించారు. అయినా కూడా ఒక లారీ కూడా పంపించకపోవడంతో దాదాపు నాలుగైదు రోజులుగా రైతులు, కంది కొనుగోలు కేంద్రం వద్ద రాత్రింబవులు ఎదురుచూపులు చూస్తున్నారు. అయితే మంగళవారం సాయంత్రం ఒక లారీ రావడంతో కొద్దిపాటి సమస్య తీరింది. అధికారులు స్పందించి వెంటనే లారీలు పంపించి రైతులకు సమస్యలు పరిష్కరించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కార్మిక చట్టవ్యతిరేక నిర్ణయాలు ఆపాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

హిందూపురం ఫ్రీకాట్ 'బి' యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక చట్ట వ్యతిరేక విధానాలను ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పుట్టపర్తి పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఆర్టీసీ డిపో నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీతో వచ్చి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ విజయ సారధికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఫ్రీ కాట్ యాజమాన్యం వేలాదిమంది కార్మికులను రోడ్డు పాలు చేయడమే కాకుండా కార్మిక సంఘాల పైన నెపం మోపి సంస్థను ఇతర ప్రాంతాలకు తరలించాలని చూడడం దుర్మార్గమన్నారు. పరిగి మండలం, కొడిగెనహళ్లి పంచాయితీ పరిధిలో ఉన్న ఫ్రీకాట్ 'బి' లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం 1983 సంవత్సరంలో సంస్థను స్థాపించి వ్యాపారం కొనసాగిస్తూ లాభాలు గడిస్తూ అనేక అనుబంధ సంస్థలు స్థాపించిందన్నారు. ఈ కంపెనీలో కార్మికులు పర్మినెంట్, జూనియర్ పర్మినెంట్, బదిలీ, క్యాజువల్ ఇతర కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 600 మందికి పైగా పనిచేస్తున్నారన్నారు. వీరు 25 సంవత్సరముల నుండి 36 సంవత్సరాలు పాటు సర్వీస్ ఉన్న కార్మికులన్నారు. వీరందరూ కంపెనీ అభివృద్ధిలో క్రమశిక్షణగా పనిచేస్తున్నారన్నారు. ప్రారంభంలో రోజుకు 5 రూపాయలు 7 రూపాయలు వేతనంతో పనిచేశారన్నారు. ఈ సంస్థ ప్రభుత్వానికి పన్నుల రూపంలో గాని కరెంట్ చార్జీల రూపంలో గాని ప్రతినెల లక్షల రూపాయలు చెల్లిస్తూ తోడ్పాటు అందిస్తోందన్నారు. అయితే ఈ నెల 9 న ఉన్న ఫలంగా ప్రభుత్వానికి గాని గుర్తింపు యూనియన్ కు గాని, కార్మికులకు గాని కారణాలు చెప్పకుండా ముందస్తు సమాచారం ఇవ్వకుండా రా మెటీరియల్ వెనక్కి పంపడం, ఉత్పత్తిని ఆపేసి కొంత మంది కార్మికులకు పనిలేదని వెనక్కిపంపడం,కొంతమంది పర్మినెంట్ బదిలి కార్మికులకు పని చెప్పకుండా నిరాకరించడం సూపర్వైజర్స్ అధికారులు నోవర్క్ నో పేమెంట్ అని బెదిరింపు ధోరణలకు పాల్పటడం లాంటి కార్యక్రమాలకు పాల్పడుతోందన్నారు. చట్ట వ్యతిరేకంగా సంస్థను మూసివేసే ప్రయత్నాలకు పూనుకోవడం బాధాకరమన్నారు.కార్మికులు, కార్మిక కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి తో పాటు కార్మికుల పిల్లల చదువులు మధ్యలో ఆపేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ఫ్రికాట్ యాజమాన్యం చేస్తున్న దుర్మార్గాల పై విచారణ జరిపి యాజమాన్యం పై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆవేదనలను దృష్టిలో ఉంచుకొని వెంటనే యాజమాన్యం వారిని పిలిచి సంస్థను పున్నప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, కోశాధికారి నందీస్, నాయకులు సదాశివరెడ్డి, శివకుమార్, రామకృష్ణ, నాగభూషణ, శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, మారుతి రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బడా సుబ్బిరెడ్డి మృతి

రైతు ఉద్యమానికి తీరని లోటు

రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

బడా సుబ్బిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడా సుబ్బిరెడ్డి మతి రైతు ఉద్యమానికి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వి.రాంభూపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బడా సుబ్బిరెడ్డి సంతాప సభను మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు హాజరై బడా సుబ్బిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సుబ్బిరెడ్డి 25 సంవత్సరాలుగా కదిరి ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న కరువు, వలసలు, సాగునీరు, పంటల నష్టపరిహారం, పట్టు రైతుల సమస్యలపై నిస్వార్థంగా, అవిశ్రాంతంగా పోరాటాలు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, ప్రస్తుత శ్రీసత్యసాయి జిల్లాలో రైతు సంఘాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లడంలో సుబ్బిరెడ్డి చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. పాడి రైతుల ఉద్యమం నుంచి రైతు ఉద్యమంలోకి వచ్చిన సుబ్బిరెడ్డి సిపిఎం విధానాలు, పోరాటాలపై అక్షర్షితులై ఆ పార్టీ కదిరి డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి అనంతపురం జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లాల్లో జిల్లా కమిటీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా పని చేసి ఆదర్శవంతమైన సేవలు అందించారని కొనియాడారు. కరవు నివారణ కోసం సాగునీటి ప్రాజెక్టుల పోరాటం, కరువు సహాయక చర్యల కోసం రైతుల పక్షాన ఆయన చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. సుబ్బిరెడ్డి మరణం రైతు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, సిఐటియు నాయకులు టి.రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, ఎన్.మధుసూదన్ నాయుడు, విరుపాక్షి, రాజారాం రెడ్డి, బిహెచ్.రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు పోతులయ్య, ఈరప్ప, నారాయణరెడ్డి, వలీ, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, వెంకట నాయుడు, కొండారెడ్డి, దేవేందర రెడ్డి, పుష్పరాజు, సువర్ణమ్మ, చిదంబరమ్మ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో 'విజ్ఞాన భారతీయ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రతిభా విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

ఐరా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ వారు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించబడిన అబాకస్ ప్రతిభా పరీక్షలలో మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి విద్యాలయం విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచారు. మంగళవారం స్థానిక పాఠశాలలో పాఠశాల చైర్మన్ వెంకటకృష్ణ, కరస్పాండెంట్ కవిత విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తమ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని అశ్విత తృతీయ స్థానం, 3వ తరగతి విద్యార్థి సాత్విక్ ఆరవస్థానంలో నిలిచారన్నారు. అదేవిధంగా 28 మంది విద్యార్థులు అబాకస్ అచీవర్స్ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. వీరందరికి సోమవారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ఐరా సంస్థ సభ్యులు బహుమతులు ప్రధానం చేసినట్లు తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ మాధవి, అబాకస్ టీచర్ హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ సూచించారు. మంగళవారం కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎంఇఒలు ఓబుల రెడ్డి, చెన్నక్రిష్ణ సహకారంతో అంగనవాడీలకు ఆర్థిక అక్షరాస్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థలు, మహిళల పని ప్రదేశాల్లో ఆర్థిక అక్షరాస్యతపై వివిధ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామన్నారు. సిడిపిఒ రాధిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యత మీద అవగాహన ఉండాలని తెలియజేశారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు వీర మారుతి , నారాయణ , స్కూల్ ఉపాధ్యాయులు , అంగనవాడీలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణిని సన్మానిస్తున్న దృశ్యం

కబడ్డీ క్రీడాకారిణికి సన్మానం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చౌడేశ్వరి దేవి సేవాసమితి ఆధ్వర్యంలో 16 వ వార్డ్ కౌన్సిలర్ కేతా.లోకేష్ సహకారంతో కబడ్డీ క్రీడాకారిణిని బీరే నవ్యను సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాయచోటిలో జరిగిన 68వ ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి బాలికల పోటీలలో క్రీడాకారిణి బీరే నవ్య అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. నవ్య నవంబర్ 16 నుంచి 20 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. క్రీడాకారిణి నవ్యకు చౌడేశ్వరి దేవి సేవా సమితి తన సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు.

విజ్ఞాన ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని కదిరేపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను ఎంఇఒ శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగ ఆయన విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన తిలకించారు. విద్యార్థులకు సలహాలు సూచనలు అందించడం జరిగింది. మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు.

ఎంబిబిఎస్ విద్యార్థినికి చేయూత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని తొగటవీర క్షత్రియకు చెందిన వేల్పుల నీలకంఠుడు కుమార్తె వేల్పుల జాహ్నవి ఎంబిబిఎస్ విద్యను కర్నూలులో కొనసాగిస్తోంది. చదువుకు అవసరమైన ఆర్థిక సాయాన్నిచౌడేశ్వరి దేవి తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపం అభివృద్ధి సంఘం అందజేసింది. ఈసందర్భంగా విద్యార్థి జాహ్నవికు 80 వేల రూపాయల నగదును సంఘం ఉపాధ్యక్షుడు బండారు ఆదినారాయణ, కార్యదర్శి పూజారి నారాయణ, అధ్యక్షులు మేకల అశ్వత్ నారాయణ, కోశాధికారి మధ్యన లక్ష్మీ నరసింహులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువును మరింత ప్రోత్సహించేందుకే ఈ నగదును సహాయం చేయడం జరిగిందన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్న ఉద్దేశంతోనే తాము ఈ సేవను చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బంధనాథం ప్రకాష్, రత్నం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

మండలంలోని గాజులవారిపల్లిలోని వృద్ధాశ్రమంలోని వృద్ధ మహిళలకు ఓబుల దేవర చెరువు మండలానికి చెందిన టిడిపి నాయకులు షేక్ నిజాం చీరలు పంపిణీ చేశారు. తన 55వ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. హుండీలో పోగు చేసిన రూ,12276 నగదును ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి అందజేశారు. ఆశ్రమానికి తమ వంతు సహకారం అందిస్తున్న నిజాంను ఎస్ఐ వెంకటనారాయణ ఆశ్రమ నిర్వాహకురాలు అరుణ జ్యోతి అభినందించారు. ఈ కార్యక్రమంలో హసీనా, వసీమ్ ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం నిర్వహించారు. విజయప్రసాద్ ఆధ్యక్షతన జరిగిన ఈ ప్రజావేదికలో మండలంలోని ఇరవై పంచాయతీలకు సంబంధించి తనిఖీ బృందం తయారుచేసిన నివేదికను చదివి వినిపించారు. 1, 72676 రూపాయలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిడి చలపతి, అంబుడ్స్ మెన్ శివారెడ్డి, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ అబ్దుల్ నబీ, ఎపిఒ అనిల్ కుమార్ రెడ్డి, ఎస్ఆర్పి చంద్రమోహన్, ఉపాధి హామీ సిబ్బంది,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టిఎలు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

వరిగాలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ధనియానిచెరువు,వంకమద్ది గ్రామాల్లో సాగు చేసే వరి పొలాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ సలీం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్ పరిశీలన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్ ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ధర్మవరం మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపరచిన ఇవిఎం యంత్రాలు, వివిప్యాట్‌లను పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్ తనిఖీలో భాగంగా గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్ళు, సిసి కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్ ను పరిశీలించి అందులో సంతకం చేశారు. ఇవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ తనిఖీలో ధర్మవరం ఆర్డీవో మహేష్, ధర్మవరం తహశీల్దార్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గోడౌన్ సీల్‌ను పరిశీలిస్తున్న జేసీ

కార్మికులను పర్మినెంట్ చేసిన తర్వాతనే నిర్ణయం చేయండి

సిఐటియు పట్టణ కన్వీనర్ రాము

ఆరోగ్య అధికారికి వినతిని ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నో సంవత్సరాలుగా పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసిన తర్వాతే ఆప్కాస్‌ను రద్దు చేయాలని అలా కాకుండా ఆప్కాస్ ను రద్దుచేసి గుత్తేదారులకు అప్పగించాలని ప్రభుత్వం చూస్తే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్యకార్మికులతో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు కార్మికులందరిని కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము పేర్కొన్నారు. ఆప్కాస్ రద్దు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో పారిశుధ్య కార్మికులు మంగళవారం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు కొద్దిసేపు ఆందోళన చేసి, మున్సిపల్ ఆరోగ్య అధికారి శోభన్ రెడ్డికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిని ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి తపాలా కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీగా వచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రికి పంపారు.. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ, పురపాలక సంఘంతో పాటు వివిధ శాఖల్లో లక్షలాదిమంది కార్మికులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం కార్మికులను పర్మినెంట్ చేయకపోయినా ఆప్కాస్ విధానాన్ని తీసుకుని వచ్చి కాస్త ఉప సమయాన్ని ఇచ్చిందన్నారు. అధికారంలోకి వస్తే కార్మికులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీలపై హామీ ఇచ్చి అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు నాయుడు ఆప్కాస్ ను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు పొరుగు సేవల సిబ్బందిని నియమించుకునే అధికారం కల్పిస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవడం అన్యాయం చేయడమే అన్నారు. వెంటనే మంత్రివర్గ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ఆనంద్, రామచంద్ర, గుర్నాథ్, మూర్తి, లక్ష్మమ్మ, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, నాగలక్ష్మి, శంకర్ తో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే అభ్యున్నతి సాధ్యం : కలెక్టర్

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో డిఐఐ పిసి సర్కిల్ డెవలప్మెంట్ అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆర్బిఐ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఆర్థిక అక్షరాస్యత పై వివిధ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందించాలన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : కలెక్టరేట్లో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించే దిశగా నైపుణ్య అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. కంపెనీ అవసరాలకు అనుగుణంగా యువత శిక్షణ ద్వారా నైపుణ్యత పెంచాలన్నారు. జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమా, ఇంజనీరింగ్ కోర్సులు చేసినవారిని గుర్తించి నైపుణ్య శిక్షణలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి అధికారి హరికృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజరు రమణ కుమార్, డి ఆర్ డి ఏ పిడి నరసయ్య, ఎంప్లాయ్‌మెంట్ అధికారి కళ్యాణి, సీడాప్ జేడీఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ వస్తువులను సకాలంలో పంపిణీ చేయాలి : పిడిఎస్ వస్తువులను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలనికలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాలు నందు (ప్రైజ్ మానిటరింగ్ కమ్యూనిటీ) ధరల పర్యవేక్షణ మరియు నియంత్రణ కమిటీ, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు బజార్ల ద్వారా, 34 ప్రత్యేక కౌంటర్లు తెరిచి రోజువారీ వస్తువులు, నూనెలను విక్రయించాలని ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో కంది పప్పును విక్రయించే అవకాశాలను తనిఖీ చేయడానికి హెూర్డింగ్ పాయింట్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని మార్కెట్లలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ద్వారా అమలు చేస్తున్నారా లేదా తనిఖీ నివేదికలను లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు నివేదికలను తయారుచేసి జాయింట్ కలెక్టర్ కు పంపాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ చౌక ధర దుకాణాలలో బరువులు, కొలతలను తనిఖీ చేయాలని ఆదేశించారు. నిత్యవసర వస్తువుల ధరలు అకస్మాతూగా పెరిగిపోకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు వంశీకృష్ణారెడ్డి, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-హిందూపురం

కాలనీ మహిళలతో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

పట్టణంలో ఎక్కువగా దళితులు నివాసం ఉంటున్న అంబేద్కర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ అంబేద్కర్ కాలోనిలో6 పర్యటించి, అక్కడ ఉన్న మహిళలతో సమావేశం జరిపి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతు కూటమి ప్రభుత్వానికి దళిత కాలనీల అభివృద్ధి ఏ మాత్రం పట్టడం లేదన్నారు. 20 రోజులకు ఒక సారి ఉప్పు నీటిని ఇస్తే ఎలా జీవనం చేయాలన్నారు. మున్సిపల్ అధికారులు రెండు రోజులకు ఒక సారి మంచి నీటిని కాలనీకి ఇవ్వడంతో పాటు వీధి దీపాలు, మురుగు కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో కాలోని వాసులను కలుపుకుని కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అంబేద్కర్ కాలనీ నాయకులు విమలమ్మ, రమణమ్మ, పార్వతమ్మ, లక్ష్మీదేవమ్మ, అనిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కార్మికులకు ఈ శ్రమ్‌కార్డులు అందజేస్తున్న నాయకులు

బీడీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు .ఆంధ్రప్రదేశ్ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు నిజాంవలి కాలనీ నందు సిఐటీయు నాయకులు మస్తాక్, రామమోహన్ ఈ శ్రమ్ కార్డులను నమోదు చేయించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల కోసం ఈశ్రమ్ కార్డులను ఇస్తోందన్నారు. బీడీ పై విధించే జిఎస్టి నుండి బీడీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి కేటాయించాలని డిమాండ్ చేశారు. వేలాదిమంది బీడీ రంగం పై ఆధారపడి పనిచేస్తున్నా లేబర్ అధికారుల లెక్కల ప్రకారం పదుల సంఖ్యలో మాత్రమే బీడీ కార్మికులు ఉన్నట్లు రికార్డులలో నమోదు కావడం అన్యాయమన్నారు. ప్రభుత్వమే బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన బీడీ చట్టం 1966చ బీడీ సంక్షేమ చట్టం 1976 పునరుద్ధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీడీ వర్కర్స్, సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు మున్ని, హసింతాజ్, చంద్రకళ, సిఐటియు నాయకులు ఆంజనేయులు, ఫాజిల్, రఫీ,తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విభజన చట్టంలో కృష్ణానది యాజమాన్య బోర్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని పేర్కొనడం జరిగిందని, అందుకు అనుగుణంగా కర్నూలులో ఏర్పాటు చేయాలని జలసాధన సమితి నేతలు డిమాండ్ చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా కాలువ లైనింగ్ రద్దుచేసి వెడల్పు చేయాలని, రాయలసీమ ప్రాజెక్టులకు ప్రత్యేక బడ్జెట్ విడుదల చేయాలని, మడచ్చురా బ్రాంచ్ కాలువ వెడల్పు చేయాలన్న డిమాండ్లతో జలసాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నేతలు, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు రామ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, హిందూపురం డివిజన్ అధ్యక్షులు ధనాపురం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, కృష్ణానది బోర్డును విజయవాడకు తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల రాయలసీమ ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అతి తక్కువ వర్షపాతం, అతి తక్కువ నదీజలాలాలు పారే రాయలసీమలో కష్ణానది బోర్డు ఏర్పాటు చేయకుండా, వర్షపాతం ఎక్కువ ఉండి అధికశాతం కృష్ణాజలాలు అందే ప్రాంతంలో, ప్రకాశం బ్యారేజ్ నుండి ఏటా వందల టిఎంసీలు సముద్రం పాలయ్యే విజయవాడలో ఏర్పాటు చేయడం ఆన్యాయమని తెలిపారు. కరువు ప్రాంతమైన రాయలసీమలోని కర్నూలులో కృష్ణానది బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలో 6 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి వుండగా కేవలం 150-200 చెరువులకు అరకొరగా నింపుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో మల్యాల నుండి జీడిపల్లి వరకు 3850 క్యూసెక్కుల కాలువ వెడల్పు చేయటానికి, జీడిపల్లి నుండి క్రిందకు కాలువ వెడల్పు చేయకుండా కాలువ లైనింగు చేయటానికి ప్రభుత్వం 404-405 జీఓలను విడుదల చేయటం అన్యాయమన్నారు. సంబంధిత జీఓలను రద్దు చేసి మల్యాల నుండి జీడిపల్లి వరకు హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కులకు, జీడిపల్లి నుండి క్రిందకు 6వేల క్యూసెక్కులకు కాలువ వెడల్పు చేయాలని, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3,45,000 ఎకరాలకు, రాయలసీమలో 6 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరివ్వాలని కోరారు. వచ్చే రెండేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేయటానికి 30వేల కోట్ల రూపాయలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, జల సాధన సమితి నాయకులు, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి, పట్టు రైతు సంఘం అధ్యక్షులు సోంకుమార్, డిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు ఆనంద రంగారెడ్డి, పర్యావరణవేత్త భాస్కర్ రెడ్డి, తిప్పేస్వామి, రైతు సంఘం నాయకులు నవీన్, సిద్ధారెడ్డి, ఉమర్ ఫరూక్, న్యాయవాది ఇందాద్, వినోద్ కుమార్, చౌడప్ప, సిపిఐ నాయకులుశివప్ప,కార్మికనాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మవరం పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కరోనా, అడిషనల్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఏం.బాబు. ముకుంద, లక్ష్మీ, ఓబులేసు తదితరులు సిఐటియు ఆధ్వర్యంలో . స్థానిక మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడతూ కరోనాకాలం నుండి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న మొత్తం. 87 మంది కార్మికులకు 15 వేల రూపాయలకు తగ్గకుండా వేతనం ఇవ్వాలన్నారు. అందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముస్లిం మైనార్టీలకు రుణాలు అందించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముస్లిం మైనార్టీ నిరుద్యోగ యువతకు రుణాలు అందించి ఆదుకోవాలని ఏపీ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తక్ అహమ్మద్‌ను రాష్ట్ర మైనార్టీ విభాగం టిడిపి కార్యదర్శి మహమ్మద్ రఫీ కోరారు. మంగళవారం నంద్యాలలో కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తక్ అహ్మద్‌ను మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలకు విరివిగా రుణాలు అందించాలని ఛైర్మన్‌ను రఫీ కోరారు. అలాగే రంజాన్ పర్వదినం సమీపిస్తోందని జిల్లాలోని మసీదుల మరమ్మతులకు, ఈద్గా మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. పుట్టపర్తిలో ముస్లిం మైనార్టీల కోసం నిర్మించిన షాదీ మహల్ నిరుపయోగంగా మారిందన్నారు.ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ. 30 లక్షలు అవసరమని ఆ నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూపురం డైమండ్ బాబా తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

ప్రజాశక్తి-హిందూపురం

రానున్న వేసవిలో పట్టణవ్యాప్తంగా ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని నీటి సరఫరా విభాగం ఇంజనీర్ జనార్ధన్, సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ సూచించారు. మంగళవారం నీటి సరఫరా విభాగం హాజరును మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. గొల్లపల్లి నుంచి హిందూపురానికి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పలు వార్డుల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు దుర్గా నవీన్, మున్సిపల్ ఇంజనీర్ జనార్ధన్; ఫిట్టర్లు, వాటర్‌మెన్లు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించాలి : విద్యార్థులు కష్టపడి బాగా చదివి ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్ సూచించారు. పురపాలక సంఘం పరిధిలో ని 5వ వార్డు అజీజియా ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యసాధనకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మతుల్లా, పాఠశాల కమిటీ ఛైర్మెన్ నూరుల్లా ఖాన్,విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌కుమార్

నేరాలు ఘోరాలు

టిప్పర్ కిందపడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని శాంతినగర్ కు చెందిన వినోద్ కుమార్ (16) అనే విద్యార్థి టిప్పర్ కింద పడి మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. వినోద్ కుమార్ ద్విచక్రవాహణంలో వస్తుండగా పట్టణంలోని కదిరి గేటు వద్ద ట్రిప్పర్‌ను దాటుకునే ప్రయత్నంలో అదుపు తప్పి వాహణం కింద పడ్డాడు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాన్ బెయిలబుల్ కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం టీటీడీ కల్యాణ మండపం పార్కింగ్ లో పనిచేసే సోమశేఖర్ పై దాడి కేసులో పలువురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన కళ్యాణ్ అలియాస్ కళా అతని స్నేహితులు జునైద్, బాబా ఫక్రుద్దీన్ కలసి టిటిడి కల్యాణ మంటపంలో పార్కింగ్ బాయ్ గా పని చేస్తున్న కుంటిమద్ది సోమశేఖర్ పై దాడి చేసి, చంపుతామని బెదిరించి మోటార్ సైకిల్ ను బలవంతంగా తీసుకెళ్లారన్నారు. ఈ ఘటనలో నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ గ్రామ శివారుల్లోని బహిరంగస్థలంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కుళ్లాయప్ప తెలిపారు. జమ్మల బండ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 7వేల రూపాయలు నగదును స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల్లవారి పల్లి సమీపాన ఉన్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఆలయాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. చిల్లవారిపల్లి, చిల్ల కొండాయపల్లి గ్రామాల పూజా కార్యక్రమంలో జరిగే ఆధిపత్య పోరులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణవేణి యాదవ్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - లేపాక్షి

రసాయనక ఎరువులు, పురుగుల మందులు అధికధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామనిజిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మండల మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో హిందూపురం, మడకశిర డివిజన్‌లోని విత్తన, ఎరువుల, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ వ్యవసాయం అధికారి మాట్లాడుతు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నిర్ణయయించిన ధరలకు విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. దుకాణాల్లో ధరల పట్టిక, ఎరువుల నిల్వ పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ మండలంలో వ్యవసాయ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, రబీ ఈ పంట నమోదు, రైతు విశిష్ట సంఖ్య తదితర వాటి గురించి సమీక్షించారు. ఈ సమావేశంలో హిందూపురం ఎడిఎ అల్తాఫ్ అలీ ఖాన్, మడకశిర ఎడిఎ కృష్ణమీనన్ డివిజన్ అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచాలి : డిపిఒ

ప్రజాశక్తి - లేపాక్షి

గ్రామ పంచాయతీలకు ఆదాయవనరుల పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని డిపిఒ సమత పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవోకార్యాలయం లో చిలమత్తూరు, లేపాక్షి మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పంచాయతీలలో చెత్తతో సంపద కేంద్రాల్లోని చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసి ఎరువు రైతులకు అందించాలని అన్నారు. పంచాయతీలకు ఆదాయ వనరు అయిన పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. సమావేశం అనంతరం దుర్గా వీరభద్ర పాపానసేశ్వర ఆలయాన్ని డిపిఒ సందర్శించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో నరసింహ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, మల్లికార్జున, దుర్గయ్య, సాయి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డిపిఒకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని బియ్యం స్టాక్ పాయింట్‌లో గాండ్లపెంట రేషన్ డీలర్లు, ఎండి ఆపరేటర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి కదిరి డివిజనల్ అధికారి ఎస్ వి శర్మ హాజరై పలు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవక జరగకుండా చూడాలని తహశీల్దార్లను ఆదేశించారు ఎండి ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ కార్డ్ దారులకు తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు బి బాబురావు, దేవేంద్ర నాయక్, సిఎస్‌డిటి వాణి బాయ్, స్టాక్ పాయింట్ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ అశోక్ చక్రవర్తి, డీలర్లు బాబు లక్ష్మీనారాయణ రెడ్డి, సి సంజీవరెడ్డి, రఫీ, హమాలీలు ఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు

బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీ ఉల్లా డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలో నిర్వహిస్తున్న పి ఎస్ యు మూడవ రాష్ట్ర మహాసభలు సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ నుండి ఎన్జీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథులుగా మహమ్మద్ షఫీ ఉల్లా, ఆర్ఎస్పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేశాయని విమర్శించారు. ఈ సమావేశంలో పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, వివిధ జిల్లాల ప్రతినిధులు చంద్ర, నరసింహ, నందకిషోర్, సురేష్, భాస్కర్, అయ్యన్న, చైతన్య, కేశవ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో 'బ్లూమూన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

జాతీయ రహదారి, రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కదిరి పట్టణ సిఐ డివి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బ్లూ మూన్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పోటీలలో రాణించిన విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బహుమతులను ప్రధానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తమీమ్, నిత్యశ్రీ, దీక్షిత రెడ్డి, జగన్మోహన్, ధృవి, సాయి పూర్ణిమను బ్లూ మూన్ విద్యాసంస్థల అధినేత ఎం శివశంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేందర్ రెడ్డి, ఇన్‌ఛార్జి మాధవరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రామంజులు రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థులతో అధికారులు